## 23

# దేవుని శక్తి మరియు జ్ఞానము

## 1 కొరింథీయులకు 1:18-2:5

*"అయితే ఆయన మూలముగా మీరు క్రీస్తు యేసునందున్నారు - అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెను అని వ్రాయబడినది నెరవేరునట్లు దేవుని మూలముగా ఆయన మనకు జ్ఞానమును, నీతియు, పరిశుద్ధతయు, విమోచనమునాయెను" (1 కొరింథీయులకు 1:30).*

'క్రీస్తు దేవుని శక్తియును దేవుని జ్ఞానమునైయున్నాడని" బైబిలు చెప్పుచున్నది (1 కొరింథీయులకు 1:24). యేసును ప్రభువుగా ఈ వాక్యము నిర్వచిస్తుంది. మనకు అవసరమైనవన్నీ దేవుడు క్రీస్తునందు ఉంచియున్నాడు. మనము ఆయనయందు సంపూర్ణులైయున్నాము (కొలస్సయులకు 2:10). క్రైస్తవ్యమనగా క్రీస్తు. క్రైస్తవుల యొక్క శక్తి దేవుని యొక్క క్రీస్తునందున్నది, మనుష్యుల యొక్క పద్ధతులలో కాదు. సమృద్ధిగల జీవితమును యేసు మీద మాత్రమే కట్టగలం. క్రైస్తవ్యం సంపూర్ణం మరియు కోరునది. మనుష్యుడు పైపైన అందంగా కనిపించేలా చేయగలడు మరియు ఆకారములను రూపుదిద్దగలడు; దేవుడు మాత్రమే హృదయ మార్పిడులను చేయగలడు. క్రైస్తవ్యమనేది ఒక వ్యక్తి, ఒక కార్యక్రమము కాదు.

పాపము మన జీవితములోనుండి సువార్త యొక్క శక్తిని హరించివేయును (1 కొరింథీయులకు 1:17; NIV). క్రైస్తవ్యము ఒక వ్యక్తిని క్రొత్త సృష్టిగా చేయును మరియు నూతన జీవితమును మరియు మనస్సును ఇచ్చును (2 కొరింథీయులకు 5:17; చూడు యోహాను 3:1-7; గలతీయులకు 2:20). మనము పాపమునకు చనిపోయి దేవునితో జీవించుటకు యేసు మనలను పిలుచుచున్నాడు.

మన సహజమైన ఆలోచనా దోరణిని సిలువ మార్చి తల్లక్రిందులు చేయును. మనము జీవించుటకు చనిపోవుచున్నామని మరియు మనము పొందుటకు యిస్తున్నామని చెప్పుచున్నది. పైకి వెళ్ళు మార్గము క్రింద ఉన్నదని మరియు కడపటివారు మొదటివారగుదురని అది చెప్పుచున్నది.

ఒక సిలువ వేయబడిన దేవుడు విరోధోక్త్యలంకారం. ఆయన సర్వశక్తిమంతుడు, కాని ఆయన తనకు తానుగా మానవుడగుటకు సిద్ధపడ్డాడు. ఒక క్రైస్తవుడు కూడా విరోధోక్త్యలంకారం. అతను బ్రతుకుతుండియు చచ్చినవాడు. అతను చనిపోయాడు, అయినప్పటికి అతను పూర్తిగా సజీవుడు! ప్రజలకు జీవితము కావాలి - కాని సిలువ మరణము జీవమునకు మార్గమును యిస్తున్నది. ప్రజలు విజయము కావాలని కోరుకొంటారు - కాని సిలువ విజయమునకు నడిపించు ఓటమీ. ప్రజలు ఆదరణను

కోరుదురు – కాని సిలువ మన మనసాక్షిని గుచ్చి మరియు సువార్తకు లోబడుటకు మనలను నడిపించి దేవుని యొక్క క్షమాపణలో మనము ఆదరణపొందునట్లుగా చేయును. ప్రజలకు సమాధానం కావాలి – కాని సిలువ సమాధానమును ఫలితముగా యివ్వగల ఒక యుద్ధములోనికి మనలను తెచ్చును. ప్రజలు అందమును గౌరవించుదురు – కాని సిలువ, క్రూరమైన మరియు వికారమైనది, అందములన్నిట ిని అధికమించే అందమును వ్యక్తపరచుచున్నది. మనము దేవుని శక్తిని మరియు జ్ఞానమును ఆశించినట్లైతే, సిలువ మీద క్రీస్తుతో కలిసి ప్రారంభించుదాం.

## క్రీస్తు, దేవుని శక్తి

"రక్షణ కొరకు దేవుని శక్తి" సువార్త సందేశములో ఉన్నదని పౌలు చెప్పాడు (రోమీయులకు 1:16). ఎలాంటి దేవుడు ఒక సిలువ ద్వారా పాపులను రక్షించును? కృపగల దేవుడు మరియు క్షమించే దేవుడు! క్రూర శక్తిని మానవుడు ఆరాధిస్తున్నాడు. అన్ని శక్తులను కలుపుకొనినను దేవుని శక్తి వాటికంటె గొప్పది. అది భయంకరమైనది, నిత్యమైనది, మరియు జాలి కలిగినది.

దేవుడు ఈ లోకమును తన మాటచే సృష్టించి మరియు నిర్వహించుచున్నాడు (ఆదికాండము 1:2; హెబ్రీయులకు 1:3). ఆయనకు దైవానుగ్రహ శక్తి ఉన్నది, తనను ప్రేమించువారికొరకు ఆయన పనిచేసి సమస్తమును సమకూర్చగలడు (రోమీయులకు 8:28).

ఎలాగైనా, దేవుని యొక్క గొప్ప శక్తి సిలువలో బయలుపరచబడినది. ఆయన బలహీనతగా వర్ణించబడిన ఒక శక్తి ఇది! "... బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొనెను" అని పౌలు చెప్పాడు (1 కొరింథీయలకు 1:29).

ఆయన అనంతమైన వినయమును కలిగిన దేవుడు. ఆయన మనకు రక్షణను ఇచ్చుచున్నాడు, కాని మనము దానిని పొందవలెనా లేదా దానిని ఎన్నుకొనుటకు మనకు స్వాతంత్రమునిచ్చుచున్నాడు. ఆయన మార్గమును మన జీవితములలోనికి బలవంతముగా ప్రవేశపెట్టలేదు – ఆయన తలుపు దగ్గర నిలుచుండి మరియు తట్టుచున్నాడు (ప్రకటన 3:20). ఆయన మనకు యిచ్చిన ఉచిత అవకాశంలో, మనం దేవుని వినయమును చూచుచున్నాం. పెద్ద సుత్తితో ముక్కలు చేసికొనిన వాటితో దేనిని మనము వృద్ధిపరచలేమని మనలను సమీపించుచున్న ఆయన బోధలో ఆయన చెప్పుచున్నాడు.

ఒక నగ్నమైన మనుష్యుడు సిలువమీద చనిపోవుచున్నదానికంటే ఒక నిస్సహాయ స్థితి మరొకటి ఉండదు, కాని దేవుని యొక్క గొప్పపని ఒక మనుష్యుని ద్వారా జరిగించబడినది. అతడు ఒక సిలువ పై ఉన్న దేవుని కుమారుడు. సిలువ యొక్క శక్తిని ఆలోచించుము: యేసు చనిపోని ఒక్క పాపి కుడా లేడు మరియు సిలువ తీసివేయలేని ఒక్క పాపము లేదు.

కల్వరి యొద్ద యేసు యొక్క మరణము ఒక ఆకస్మిక సంఘటానుభవము కాదు. అది లోకము పుట్టకముందు ప్రకటించబడిన, నిత్యమైన సత్యము యొక్క నెరవేర్పు. యేసు సిలువ మీద ఉన్నది కేవలం ఆరు గంటలు కాదు. ఒక విధముగా, ఆయన అక్కడ ముప్పది మూడు సంవత్సరములున్నాడు. ఆయన యొక్క భూలోక జీవితములో ఆయన ప్రతి రోజు దానిని ఎదుర్కొన్నాడు.

యేసు మన రక్షణకు ఆధారము; సిలువ మన రక్షణ మార్గం. దేవుని శక్తి బలహీనతయందు పరిపూర్ణ పరచబడుతుంది (2 కొరింథీయులకు 12:6-10). బలహీనత ద్వారా సిలువ వేయబడినా, దేవుని శక్తిని యేసు ప్రదర్శించాడు (2 కొరింథీయులకు 13:4). దీనితో మనము చేయగలిగినదంతా ఏమంటే విధేయతతో దానిని పొందడమే. మనము దానిని తిరస్కరించినట్లైతే, మన నిత్యనాశనమును మనమే చేసుకొన్నవారమగుదుము.

జర్మనీ తత్వవేత్త మరియు హేతువాదియైన ఫ్రెడ్‌రిచ్ నైయిట్జ్‌స్కి శక్తిని పూజింప దగినదిగా చేసాడు. అతడు యేసు బలహీనుడని అనుకొని యేసును తృణీకరించాడు. నైయిట్జ్‌స్కి చనిపోయాడు; సువార్త ఇప్పటికి ప్రకటించబడుతుంది.

## క్రీస్తు, దేవుని జ్ఞానము

యేసు "దేవుని మూలముగా మనకు జ్ఞానమాయెను" అని పౌలు చెప్పాడు (1 కొరింథీయులకు 1:30). దేవుని యొక్క గొప్ప శక్తి ఆయన జ్ఞానము చేత నడిపింపబడును. మన రక్షణకొరకైన ఆయన గొప్ప ప్రణాళిక ఆయన గొప్ప జ్ఞానమును వ్యక్తపరచుతుంది.

దేవుడు, ఆయన జ్ఞానమందు, క్రైస్తవ్యమునకు మధ్యలో సిలువను ఉంచాడు. సిలువ ఒక ఆకారమని మానవుడు అనుకొనును, కాని అదే ఆయన యొక్క మహిమ యొక్క పరిపూర్ణత అని దేవుడు చెప్పుచున్నాడు.

పాపములన్నిటికి మూలాధారమైన పాపం - ఊహించుట (కీర్తనలు 19:13; 2 పేతురు 2:10). తాను ఆలోచించే విధముగానే దేవుడు ఆలోచించునని లేక ఖచ్చితంగా ఆయన అలాగే ఆలోచించాలని మనుష్యుడు ఊహిస్తాడు. జీవితమును చక్కగా చేయునని మానసిక శాస్త్రం *వాగ్దానము* చేయును. క్రీస్తు పాపులకు జీవమునిచ్చును, జీవితాంతము! చనిపోయిన మనుష్యునికి జీవము అవసరము, పునరావాసం కలిగించడం కాదు (ఎఫెసీయులకు 2). దేవుని శక్తి ఎల్లప్పుడు చనిపోయినవారిని లేపుచున్నది. సిలువ యొద్ద దేవుడు పాపులను మరణమునుండి లేపియున్నాడు.

మనుష్యుడు యుద్ధము, పేదరికము, మరియు రోగములనుండి రక్షణను కోరుకొంటున్నాడు. సిలువ మీద ఉన్న క్రీస్తు మనలను పాపములనుండి రక్షిస్తున్నాడు. మానవుడు పాపమునుండి రక్షింపబడునంతవరకు యుద్ధములను, యితరుల యెడల చెడుగా ప్రవర్తించుటను, లేక సమాజిక ఆందోళనలను పరిష్కరించుకోలేడు. పాపము సిలువ దగ్గర మాత్రమే స్వస్థత పొందగలదు.

వివేకంగల గర్వ హృదయులకు, సిలువ ఇప్పటికి అవివేకముగా ఉన్నది. మానవునికి అధికారము కావాలి, జ్ఞానము కాదు - జ్ఞానోదయం, విశ్వాసం కాదు. ఒకడు సిలువను హత్తుకొని, అదే సమయంలో గర్వాన్ని, ద్వేషాన్ని, మరియు పాపమును హత్తుకొనలేడు. ఎవరూ సిలువ యొద్ద నిలబడుకొని అతిశయించలేరు.

రక్షింపబడుటకు యిష్టములేని లోకమును రక్షించుటకు యేసు సిలువలో మరణించాడు. ఎలాంటి ఒక రక్షకుడండి! క్రీస్తును మరియు ఆయన సిలువేయబడుటను తప్ప దేనిని మీమధ్య నెరగకుందునని పౌలు తీర్మానించుకొన్నాడు (1 కొరింథీయులకు 2:1-5). దీనిని నమ్మండి మరియు దీనిని ప్రకటించండి! సువార్త సందేశము యొక్క శక్తియందు విశ్వాసమెప్పుడు కోల్పోవద్దు! దేవుడు లేకుండా భక్తిపరులమనుకొనుటను, క్రీస్తు లేకుండ క్రైస్తవులుగా ఉండుటను, ఆత్మలేకుండా ఆత్మీయులముగా ఉండుటను విడిచి పెడదాము.

ఉరిశిక్షను (సిలువ శిక్షను) సాధనముగా వాడుకొని భూమిమీద దానిని ఒక ప్రేరేపణా శక్తిగా (ఆకర్షణ) దేవుడు మాత్రమే చేయగలడు, సిలువకు వేరుగా స్వయంను చంపుకోగల శక్తి లేదు. సిలువకు వేరుగా, జీవితము దాని పరిపూర్ణతతో జీవించుటకు ఏ జ్ఞానము లేదు. యేసు ఇలా చెప్పాడు, “నేను భూమిమీదనుండి పైకెత్తబడినయెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందును” (యోహాను 12:32). మనుష్యులందరిని ఆయన తన యొద్దకు ఆకర్షించుకొనగలడు ఎందుకనగా దేవుని యొక్క జ్ఞానముతో మరియు శక్తితో సిలువ పెట్టుబడిగా పెట్ట బడినది.

*సిలువే ...*
*తప్ప మరొక మార్గం లేదు!*